

గణతంత్ర వేడుకల సందర్భంగా సూర్యాపేట క్యాంప్ కార్యాలయంలో జాతీయ జెండా ఎగుర వేసి వందనం చేస్తున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్

నమస్తే తెలంగాణ
# నల్లగొండ
5 | నల్లగొండ, సోమవారం 27 జనవరి 2025 | NALGONDA



సూర్యాపేట మండలం కేటీ అన్నారంలో ప్రజా పాలన పథకాల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, పక్కన మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

# రేపు బీఆర్‌ఎస్ రైతు మహాధర్నా

- క్లాక్ టవర్ సెంటర్‌లో ధర్నాకు ఏర్పాట్లు
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో సన్నాహకాలు
- భారీగా తరలొచ్చేందుకు సిద్ధమవుతున్న రైతన్నలు
- మహాధర్నాకు విస్తృత ప్రచారం



## హాజరుకానున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**కాంగ్రెస్ సర్కార్ చేస్తున్న రైతు మోసాలపై నల్లగొండ వేదికగా జంగ్‌సైరన్‌కు బీఆర్ఎస్ సన్నద్ధమవుతున్నది. అసంపూర్తి రుణమాఫీ, కోతల రైతు భరోసాలతోపాటు బోనస్ ఎగవేత తదితర అంశాలపై రైతుల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీసేందుకు క్లాక్ టవర్ వేదికగా మహాధర్నాకు పిలుపునిచ్చింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. రైతు మహాధర్నాకు అడుగడుగునా ప్రభుత్వం అనుమతులు ఇవ్వకుండా ఆటంకాలు సృష్టిస్తున్నా బీఆర్ఎస్ హైకోర్టు తలుపుతట్టి అనుమతులు సాధించింది. హైకోర్టు ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మహాధర్నాకు సిద్ధమైంది. ఈ ధర్నాకు ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్న రైతులు స్వచ్ఛందంగా తరలి వచ్చే సంకేతాలు ఉండడంతో అందుకు అనుగుణంగా బీఆర్ఎస్ నేతలు ఏర్పాట్లల్లో నిమగ్నమయ్యారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి నేతృత్వంలో పార్టీ మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షులు, ఇతర ముఖ్య నేతలంతా మహాధర్నాపై దృష్టి సారించారు. ఆదివారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పార్టీ నేతలతో కలిపి క్లాక్‌టవర్ సెంటర్‌లో ధర్నా ఏర్పాట్లను సమీక్షించారు.**

– నల్లగొండ ప్రతినిధి, జనవరి26(నమస్తే తెలంగాణ)



నల్లగొండ క్లాక్ టవర్ సెంటర్ వద్ద బీఆర్ఎస్ మహాధర్నా ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, నాయకులు

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన నాటి నుంచే తొలి సీఎం కేసీఆర్.. వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ దేశంలోగా రాష్ట్ర రైతన్నలను సగర్వంగా తలెత్తుకునేలా తీర్చిదిద్దిన విషయం తెలిసిందే. ఎవ్వరూ ఊహించని విధంగా వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంటు, సాగునీరు, పెట్టుబడి సాయంగా రైతుబంధు, రైతు బీమా, సకాలంలో ఎరువులు, విత్తనాలు, పంటల కొనుగోళ్లు, వెనువెంటనే చెల్లింపులు ఇలా సాగుమడిలో రైతన్నను కేసీఆర్ నిరంతరం వెన్నుతట్టి ప్రోత్సహించారు. దీంతో దేశంలో రాష్ట్రం, రాష్ట్రంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యవసాయంలోనే అనతికాలంలోనే అగ్రభాగాన నిలిచింది. దేశంలోనే అత్యధిక ధాన్యం పండించిన జిల్లాగా నల్లగొండ చరిత్రకెక్కింది. ఏ ఊరు చూసినా పచ్చని పొలాలతో కళకళలాడింది. రైతుల మోకాల్లో వెలుగులు నిండాయి. కేసీఆర్ పాలనలో ఉమ్మడి జిల్లాలో 13లక్షల ఎకరాల నుంచి 23 లక్షల ఎకరాలకు సాగు భూమి విస్తరించింది. దీంతో ఒక్కో సీజన్‌లో 40లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం ఉత్పత్తి జరిగింది. ఇలా రాష్ట్ర ఏర్పాటు అనంతరం కేసీఆర్ పాలనలో వ్యవసాయ రంగంలో అత్యధిక లబ్ధి పొందిన జిల్లాగా నల్లగొండ అవతరించింది. కానీ ఏడాదిగా కాంగ్రెస్ ప్రభుత్వం అనసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలతో వ్యవసాయం తిరిగి కుదేలయ్యే పరిస్థితులు నెలకొంటున్నాయి. రుణమాఫీ అమలులో, రైతుభరోసా డబ్బుల్లోనూ ప్రభుత్వ విధానాలతో రైతన్నకు మొండిచెయ్యి చూపుతున్నది. రెండు లక్షల రూపాయల రుణమాఫీ కోసం నేటికీ ఉమ్మడి జిల్లాలో రెండు లక్షల మందికి పైగా రైతులు ఎదురుచూస్తూనే ఉన్నారు. ఇక రైతుభరోసా ద్వారా ఉమ్మడి జిల్లాలో 25 లక్షల మంది రైతులకు ఒక్క సీజన్‌లోనే ఎకరాకు రూ.7500 చొప్పున పెట్టుబడి సాయం అందిస్తే సుమారు రూ.1950 కోట్ల లబ్ధి రైతులకు జరుగాల్సి ఉంది. కానీ దాన్ని ఆరు వేలకు కుదించడం వల్ల ఆ లబ్ధి రూ.1,300 కోట్లు కూడా దాటేలా లేదు. గత యాసంగిలో ఎకరం మీద రూ.2,500 కోత, వానకాలంలో మొత్తంగా రూ.7,500కు ఎసరు, ప్రస్తుత సీజన్‌లో సైతం ఎకరాకు రూ.1500 కోత పెట్టడం వల్ల మొత్తంగా 11,500 ఒక్కో ఎకరంపైన రైతు పెట్టుబడి సాయాన్ని కోల్పోతున్నాడు. మొత్తంగా చూస్తే సుమారు 3వేల కోట్ల రూపాయల రైతు భరోసాకు కాంగ్రెస్ సర్కార్ ఎసరు పెట్టింది.

కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై రైతులు తీవ్రంగా మండిపడుతున్నారు. స్వచ్ఛందంగా అనేక ప్రాంతాల్లో రైతులు వివిధ సందర్భాల్లో రోడ్లెక్కారు. పంటల కొనుగోళ్లపై, బోనస్ డబ్బుల ఎగవేతపై, రైతుభరోసా ఎగనామంపై, పలుమార్లు కరెంటు కోతలపై, ఎరువుల కొరతలపై ప్రభుత్వాన్ని నిలదీసే ప్రయత్నాలు చేశారు. ఇదే సమయంలో ప్రభుత్వ తోడ్పాటు కొరవడడంతో రైతులు సాగుమడిలో చతికిలపడుతూ ఆత్మస్థైర్యం కోల్పోతున్న సందర్భాలు నెలకొంటున్నాయి. దీంతో కొందరు రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 30 మంది వరకు రైతులు ఏడాది కాలంలో తనువు చాలించినట్లు రైతు సంఘాల అంచనా. ఇట్లాంటి తిరోగమన పరిస్థితుల్లో రైతుల ఆవేదనను అర్థం చేసుకున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రంగంలోకి దిగుతున్నారు.

### చకచకా ఏర్పాట్లు

రైతుభరోసా మోసంపై నల్లగొండ క్లాక్‌టవర్ సెంటర్ వేదికగా తలపెట్టిన రైతుమహాధర్నాలో కేటీఆర్ పాల్గొననున్నారు. నల్లగొండ క్లాక్‌టవర్ సెంటర్‌లో మంగళవారం ఉదయం 11 గంటలకు రైతు మహాధర్నాకు పార్టీ నేతలు చకచకా సాగుతున్నాయి. మహాధర్నాకు విస్తృత ప్రచారం కల్పించేలా నల్లగొండలో ఫ్లెక్సీలు, కటౌట్లు, హోర్డింగ్‌లు ఏర్పాటుపై దృష్టి సారించారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి... ఉమ్మడి జిల్లాల పార్టీ అధ్యక్షులు, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ జడ్పీ చైర్మన్లు, ఇతర ముఖ్య నేతలందరినీ ఎప్పటికప్పుడూ సమన్వయం చేస్తున్నారు. ఈ నెల 24వ తేదీన నల్లగొండ పార్టీ కార్యాలయంలో ముఖ్యులందరితో సమావేశమై మహాధర్నాపై దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ఆగ్రహంతో ఉన్న రైతులే స్వచ్ఛందంగా తరలి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, అందుకు కావాల్సిన సహకారం పార్టీ నేతలు అందించాలని సూచించారు. రైతులు కూడా పెద్ద సంఖ్యలో తరలిరానున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా ధర్నాస్థలంలో ఏర్పాట్లు చేయాలని జగదీశ్‌రెడ్డి స్థానిక నేతలకు సూచించారు. కాగా ఆదివారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పార్టీ నేతలతో కలిసి క్లాక్‌టవర్ సెంటర్‌లో మహాధర్నా ఏర్పాట్లను పరిశీలించారు. వేదిక, సభాప్రాంగణం, పార్కింగ్, ఇతర సదుపాయాలపై పార్టీ నేతలో చర్చించారు. ధర్నాకు వచ్చే పార్టీ శ్రేణులకు, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోనున్నట్లు ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి వివరించారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి నిరంజన్ వలీ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, సింగం రామ్మోహన్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు కొండూరు సత్యనారాయణ, జమాల్ ఖాద్రి, పల్లె రంజిత్, రావుల శ్రీనివాస రెడ్డి, బొజ్జ వెంకన్న, లొడంగి గోవర్ధన్, మెరుగు గోపి తదితరులు పాల్గొన్నారు.

# మెల్లమెల్లగా మొదలు పెట్టి.. సుతిమెత్తగా సూదులు గుచ్చుతూ..

- తొలి అధికారిక సభలో పాల్గొన్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి
- ప్రభుత్వం బాధ్యతను గుర్తెరిగి పాలన సాగించాలని పిలుపు
- ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్

సూర్యాపేట, జనవరి 26 (నమస్తే తెలంగాణ) : ఏడాది కాలం తర్వాత తొలి ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి తన ప్రసంగాన్ని మెల్లమెల్లగా మొదలు పెట్టి ప్రభుత్వ బాధ్యతలను గుర్తు చేశారు. సుతిమెత్తగా సూదులు గుచ్చుతూ నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్రను పోషించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన నాలుగు సంక్షేమ పథకాల ప్రారంభోత్సవం సందర్భంగా సూర్యాపేట మండలం కేటీఅన్నారం గ్రామంలో ఆదివారం జరిగిన సభకు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పాల్గొనగా స్థానిక ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి కూడా హాజరయ్యారు. అధికారిక కార్యక్రమంలో ప్రతిపక్షంలో ఉన్న జగదీశ్‌రెడ్డి ఏం మాట్లాడుతారు..? ఎలాంటి పద ప్రయోగాలు ఉంటాయి..? అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఎన్ని సెటైర్లు వేస్తారా అని అక్కడున్న ప్రజలతోపాటు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ శ్రేణులు వేచి చూశారు. ప్రభుత్వం తన బాధ్యతను గుర్తెరిగి పాలన సాగించాలని, ప్రజలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలంటూ ప్రసంగం ప్రారంభించారు. తొలిరోజు సంక్షేమ పథకాలను అందుకుంటున్న వారికి అభినందనలు చెప్పారు. ఏ ప్రభుత్వం అయినా ప్రజలకు ఏదీ దానం ఇవ్వదని, ప్రభుత్వం తన బాధ్యతను గుర్తెరిగి వ్యవహరించాలని, ఎన్నికలకు ముందు విడుదల చేసే మ్యానిఫెస్టోను నెరవేర్చే బాధ్యతను వంద శాతం చేసి తీరాలని సూచించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు ఈ సభకు వచ్చి ఎదురుగా ఉన్న మహిళలకు రూ.2,500 వస్తేనే మహాలక్ష్మి పథకం అమలు చేసినట్లు అని, ప్రతి అర్హత ఉన్న మహిళకు రూ.2,500ల ఇవ్వాలని సభా వేదికపై ఉన్న మంత్రి తుమ్మల ఎదుట డిమాండ్ చేశారు. అలాగే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచితం మంచిదే కానీ, ఈ స్కీమ్ వల్ల ఆటోవాలా పరిస్థితి దీనంగా మారి ప్రతి నిత్యం ఆత్మహత్యలు వెలుగులోకి వస్తున్నాయని, ప్రతి ఆటో కార్మికుడికి హామీ మేరకు రూ.12వేలు ఇవ్వాలని మంత్రికి సూచించారు. ఇక ఉపాధిహామీ కూలీలకు నిబంధన పేరిట ఏదో కొద్దిమందికి కాకుండా అందరికీ పింఛన్ ఇవ్వాలని కోరారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని నమ్మబలికిన ప్రభుత్వం గతంలో తమ ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలనే భర్తీ చేసి అరకొరగా నియామకాలు చేపట్టిందని, ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎక్కడ ఎవ్వరికి అన్యాయం జరిగినా నేను అండగా ఉంటా.. అందరం కాలిసి కొట్లాడుదాం అని సభా వేదిక ద్వారా జగదీశ్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఆదాయ వనరులు, నిధులు చూసుకోవడం, ప్రాధాన్యత అంశాలను ఎంచుకోవడం, ఇలా అన్నీ చక్కదిద్దుకోవడం కోసం ప్రతిపక్షంగా ప్రభుత్వానికి కొంత సమయం ఇస్తుంటారని, అలాగే ప్రతిపక్షంగా బీఆర్ఎస్ కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆరు నెలల గడువు ఇచ్చిందని జగదీశ్‌రెడ్డి గుర్తు చేశారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎప్పుడూ పాజిటివ్‌గా ఆలోచిస్తారని, అందుకే ఆరు నెలలు కాదు మరో ఆరు నెలల గడువు ఇవ్వాలని, అప్పటి వరకు పార్టీగా బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎలాంటి వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టలేదని చెప్పారు.

ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ వంద శాతం అమలు చేయాలని మరో సారి డిమాండ్ చేశారు. ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీగా ఎలాంటి పిలుపులు ఇవ్వక ముందే ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళనలు, నిరసనల పేరిట రోడ్లపైకి వస్తున్నారని, కాంగ్రెస్ పార్టీకి ఇచ్చిన సమయం పూర్తయినందున ఇక బీఆర్ఎస్ రంగంలోకి దిగితే కాంగ్రెస్ ప్రభుత్వానికి ముచ్చెమటలు తప్పవని చెప్పారు.

# అనర్హులకు ఎలా ఇస్తారు?

**కొత్త పథకాలపై పలు చోట్ల గ్రామస్తుల ఆందోళన**



మోతె : విభళాపురం గ్రామంలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు



గరిడేపల్లి : అధికారులను ప్రశ్నించిన వారిని బయటకు పంపుతున్న పోలీసులు

గరిడేపల్లి/మోతె, జనవరి 26 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన నాలుగు పథకాల ప్రారంభ కార్యక్రమంలో పలు చోట్ల రగడ నెలకొంది. అర్హులకు పథకాలు దక్కలేదంటూ నిరసనలు వ్యక్తమయ్యాయి. సూర్యాపేట జిల్లా గరిడేపల్లిలో గ్రామానికి చెందిన ప్రధాని సైదులు, మరికొందరు అధికారులను నిలదీశారు. ఉన్నోళ్లకే పథకాలు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోతె మండలం విభళాపురంలో కూడా కొందరు ప్రజలు అధికారులతో వాగ్వాదానికి దిగారు. 50 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్న వారికి రేషన్ కార్డులు వచ్చాయని, గుంట భూమి లేని వారికి రేషన్ కార్డు రాలేదని గ్రామసభలో వాపోయారు.

# ముఫ్వన్నెల రెపరెపలు

- జిల్లా వ్యాప్తంగా ఘనంగా గణతంత్ర దినోత్సవాలు
- జాతీయ జెండాలు ఎగురవేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు

**76వ గణతంత్ర దినోత్సవాలు ఆదివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల వద్ద అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని జాతీయ జెండా ఎగుర వేశారు. స్వీట్లు పంచారు. పలు పాఠశాలల విద్యార్థులు జాతీయ పతాకాలతో ర్యాలీ తీశారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లా కేంద్రాల్లోని పరేడ్ గ్రౌండ్‌లో కలెక్టర్లు ఇలా త్రిపాఠి, తేజస్ నందలాల్ పవార్ జాతీయ జెండా ఎగుర వేశారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. స్వాతంత్ర్య సమరయోధులను సన్మానించారు. వివిధ సంఘాల ఆధ్వర్యంలో స్టాళ్లను ప్రదర్శించారు. పరేడ్ గ్రౌండ్‌లో వివిధ పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.**



నల్లగొండ బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, చిరుమర్తి లింగయ్య, నాయకులు

## ప్రజల భవిష్యత్ కోసమే అభివృద్ధి, సంక్షేమ పథకాలు

- అర్హులందరికీ రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు
- రిపబ్లిక్ వేడుకల్లో నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి



నల్లగొండ పరేడ్ గ్రౌండ్‌లో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్రపవార్

నల్లగొండ, జనవరి 26 : రాష్ట్ర ప్రజల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని వారి జీవన విధానంలో మార్పులు తేవాలనే ఆలోచనతోనే ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదని, ఈ పథకాలను కింది స్థాయిలో ఉన్న వర్గాలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగాగా ఆమె ఆదివారం నల్లగొండలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో కలిసి పోలీసుల నుంచి గౌరవం వందనం స్వీకరించారు. ఆ తర్వాత జిల్లా ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ ప్రాధాన్యత కల్పించాలనే ఆలోచనతో జిల్లాలో 4,276 మంది ఎన్యుమరేటర్స్‌తో 5,11,638 ఇండ్లల్లో కుల సర్వే చేసినట్లు తెలిపారు. మహాలక్ష్మి కింద 3.75లక్షల మందికి ఉచిత బస్సు ప్రయాణం అందించడంతోపాటు 2,33,981 మందికి రూ.2,044.83కోట్లు రుణమాఫీ చేసినట్లు తెలిపారు. గృహ జ్యోతి పథకం కింద 2,35,628 మంది లబ్ధిదారులకు 200యూనిట్ల చొప్పున ఉచిత విద్యుత్ ఇస్తున్నామని అన్నారు. ఎస్ఎల్‌బీసీలో 42ఎకరాల్లో వైద్య కళాశాల ప్రారంభించి ఐదు ఎకరాల్లో రూ.40కోట్లతో నర్సింగ్ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. నల్లగొండ, మునుగోడు నియోజక వర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం కోసం 25ఎకరాల చొప్పున కేటాయించి నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. శాంతి భద్రతల విషయంలో ముందస్తు చర్యల్లో భాగంగా 3,280 సీసీ కెమారాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం పలు శాఖల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందచేశారు. పలు సంఘాలకు ఆస్తుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేశ్, ఆర్డీఓ శేఖర్ రెడ్డిలతో పాటు ఆయా శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



సూర్యాపేట పరేడ్ గ్రౌండ్‌లో జెండా ఆవిష్కరించి వందనం చేస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

## అభివృద్ధి, సంక్షేమంలో జిల్లాను ముందు నిలపాలి

- అర్హులందరికీ పథకాలు అందించేలా చర్యలు
- గణతంత్ర వేడుకల్లో సూర్యాపేట కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

సూర్యాపేట, జనవరి 26 : ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించి జిల్లాను ముందంజలో ఉంచాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ అన్నారు. సూర్యాపేట పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆయన జాతీయ జెండా ఎగుర వేసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా ప్రగతిని వివరించారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో ఇప్పటి వరకు 2.16 కోట్ల ప్రయాణాలు జరిగాయని, దీని ద్వారా రూ.115 కోట్లు ప్రభుత్వం చెల్లించిందన్నారు. 1.45 లక్షల మందికి రూ.500 చొప్పున గ్యాస్ సిలిండర్లకు సబ్సిడీ ఇస్తున్నట్లు చెప్పారు. గృహ జ్యోతి పథకంలో 1.79 లక్షల మందికి ఉచితంగా 200 యూనిట్లు అందిస్తున్నారని, దీని ద్వారా రూ. 56.42 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. జిల్లాలో 1.12 లక్షల మంది రైతులకు రూ.845 కోట్లు రైతు రుణ మాఫీ అయిందని, 285 మంది రైతులకు రైతు బీమా ద్వారా రూ.14.25 కోట్లు అందిందని తెలిపారు. అంతకు ముందు పరేడ్ కమాండెంట్ నారాయణరాజు నేతృత్వంలో పోలీస్ పరేడ్ నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధులను శాలువాలతో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఘనంగా సన్మానించారు. జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి రెడ్డి, అదనపు కలెక్టర్ రాంబాబు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, ఆర్డీఓ వేణుమాధవ్, అదనపు ఎస్పీ జనార్దన్‌రెడ్డి, డీఎస్పీ రవి తదితరులు పాల్గొన్నారు.




